అటకెక్కించారు.. ప్రత్యామ్నాయం మరిచారు

- రెండు దశాబ్దాలు దాటినా జరగని సిద్దవటం – బద్వేలు రోడ్డు విస్తరణ
- ఇరుకు రోడ్డులోనే వాహన రాకపోకలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు



విస్తరణ పనులు జరుగక సిద్దవటంలో అవస్థలు పడుతున్న వాహనదారులు

సిద్దవటం : మండల కేంద్రంలో కడప – బద్వేల్ ప్రధాన రహదారి విస్తరణ ఉత్తుత్తిదేనని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతుంటే సిద్దవటం మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని చెప్పక తప్పదు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిద్దవటంలో రోడ్డు విస్తరణ పరిహారం కోసం నిధులు మంజూరు చేశారు. రోడ్డుకు తొలుత 60 అడుగుల మేర విస్తరణ చేపట్టాలని నిర్ణయించగా, కొందరు రాజకీయ నాయకుల ఒత్తిడితో రోడ్డు వెడల్పును 50 అడుగులకు కుదించారన్నారు. దాదాపు 90 శాతం మందికి పరిహారం కూడా అందించారు. 10 శాతం మందికి పరిహారం అందలేదు. వీరు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో అధికారులకు తలకు మించిన భారమైంది. దీనికి ప్రత్యామ్నాయం కూడా అధికారులు ఆలోచించకపోవడంతో విస్తరణ పనులు అటకెక్కాయి. ఇప్పటికే 20 సంవత్సరాలు కావస్తున్నా రహదారి విస్తరణకు మోక్షం లభించలేదు. సిద్దవటం మీదుగా కడప, బద్వేల్, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగుళూరు, అమరావతి, విజయవాడ, కాకినాడ, వంటి ప్రాంతాలకు ప్రతి నిత్యం బస్సులు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిద్దవటం ఎగువపేటలోని ప్రధాన మలుపుల వద్ద, ఇరుకురోడ్ల వద్ద వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం కలిగి ట్రాఫిక్ జామ్ అయిన సందర్భాలు కోకొల్లలు. నాటి జిల్లా కేంద్రం నుంచి సిద్దవటం చరిత్ర కాలక్రమేన మసకబారుతూ ఉండటం, సిద్దవటంలోని ప్రజా సమస్యలను పరిష్కరించే సరైన రాజకీయ నాయకుడు లేకపోవడంతో అభివృద్ధికి సిద్దవటం ఆమడదూరంలో ఉంది. దీనికి చక్కటి ఉదాహరణగా సిద్దవటం రహదారి విస్తరణ జరగకపోవడమేనని చెప్పవచ్చు. ఇలా ఉండగా గోరుచుట్టుపై రోకలిపోటు అన్న చందంగా రోడ్డు విస్తరణకు అటవీశాఖ వారు ఏర్పాటు చేసిన చెక్ పోస్టు రాత్రివేళల్లో వాహనాల రాకపోలకు అడ్డంకిగా మారింది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టకుండా మీనమేషాలు లెక్కిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారిని విస్తరించాలని కోరుతున్నారు.

ఇరుకు రోడ్డులో ప్రయాణం ఇబ్బందికరం



సిద్దవటంలోకి బస్సు వస్తూనే ఇక్కడ ఉన్న ఇరుకు రోడ్లలో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఎదురుగా వాహనాలు వస్తే బస్సును ఆపుకోవాల్సిన పరిస్థితి. ఎప్పటి నుంచో రోడ్డు విస్తరణ పనులు చేస్తామంటున్నారు తప్పా ఇప్పటి వరకు అది జరిగిందిలేదు. విస్తరణ నోచుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– జి.మునెయ్య, ఆర్టీసీ డ్రైవర్, బద్వేల్ డిపో

పరిహారం ఇవ్వాల్సి ఉంది

సిద్దవటం రోడ్డు విస్తరణలో ఇంకా 10 శాతం మందికి పరిహారం ఇవ్వాల్సి ఉంది, ఈ పరిహారం కోసం రూ. 50 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయితే బాధితులకు పరిహారం అందజేసి తక్షణమే రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తాం.

– షాషావలి, ఆర్ అండ్ బీ, డీఈ, కడప

క్లుప్తంగా

పుస్తకాలు అందజేత


పుస్తకాలను అందజేసిన సూపర్‌వైజర్ శ్రీవిద్య

సిద్దవటం: అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల మేధాశక్తిని పెంపొందించేందుకు పుస్తకాలు దోహదపడుతాయని ఐసీడీఎస్ సైపర్‌వైజర్ శ్రీవిద్య తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారుపేట గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రీ స్కూల్ పిల్లలకు అందించే పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రీ స్కూల్‌లో పిల్లల నమోదుకు తల్లిదండ్రులు సహకరించాలని ఆమె కోరాకు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టండి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె : రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం వైకోట గ్రామంలో నూతన పక్కా రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.7.50 లక్షల వ్యయంతో నూతన రోడ్డు పనులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలో పక్కా రోడ్డు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, మాజీ సర్పంచ్ ఆడపాల బాలాజీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నందలూరు : మండలంలోని నందలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొర్లగుంట సుబ్బరామయ్య పెద్ద కర్మ కార్యక్రమంలో గురువారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొని సుబ్బరామయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో అరిగె సౌమిత్రి, గుండు మల్లికార్జున రెడ్డి, విశ్వనాథ రెడ్డి, సుబ్బరామరాజు, దండు గోపి, పెనుబాల నాగసుబ్బయ్య, శంకర, కల్యాణ్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిట్వేలి : మండలంలోని చిట్వేలి బ్రాహ్మణ వీధి కెఎస్ అగ్రహారం, పాత చిట్వేలిలో నివాసం ఉంటున్న అగ్నికుల క్షత్రియ, వన్నికుల క్షత్రియ, పల్లిరెడ్డి, పల్లికాపు, వన్నిరెడ్డి, వన్ని కాపు వర్గాలకు చెందిన వారు యూనియన్ ఏర్పాటు చేసుకొని దానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో చిట్వేలి సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ మోహన్‌కృష్ణల చేతులమీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు.

స్టడీ అవర్స్‌ను రద్దు చేయాలి

రామాపురం : పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక పేరిట సెలవు రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు స్టడీ అవర్స్‌ను నిర్వహించడం సబబుకాదని పీఎస్టీయూ సంఘం రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ మజహరుల్ హక్, సిబకతుల్లా, లియాహత్ అలీలు అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వారంలో ఒక రోజు విశ్రాంతి ఉండాలని లేకపోతే ఒత్తిడి ఏర్పడి ఫలితాలపై ప్రభావం పడుతుందని వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయం ప్రయోజనకరం

సుండుపల్లె : మడితాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని గురువారం ఏడీఏ శ్రీలత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకొని పంటలు పండించుకోవడం ద్వారా రైతులు ఆరోగ్యకరమైన ఆహారం పొందడమే కాకుండా భూమి సారాన్ని మెరుగుపరుచుకోవచ్చని రైతులకు సూచించారు. అలాగే మామిడిలో మంచుకు పూత మగ్గిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం కూరగాయల పంటను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, వీహెచ్‌ఏ రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జ్ ఎస్.వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

రామసముద్రం: మండలంలోని కాప్పల్లె హరిజనవాడలో నిర్మించిన కుంటి గంగమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేసి పుష్పాలతో అలంకరించారు. భక్తులు తరలివచ్చి అమ్మ వారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ


క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

పుల్లంపేట : మండల విద్యాశాఖ అధికారులు చక్రాధర్ రాజు, నాగా తిరుమలరావుల చేతులమీదుగా గురువారం పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులకు శిక్షణ

చిట్వేలి : మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ఎస్ఎంసీ కమిటీలకు గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్యల అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్పీలు చెన్నకేశవరెడ్డి, శ్రీహరి, నారాయణ రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణా కార్యక్రమం పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


వీరబల్లి: సచివాలయం ముందు నిరసన తెలుపుతున్న వలంటీర్లు

నందలూరు : ఎన్డీయే కూటమి ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ వలంటీర్లు డిమాండ్ చేశారు. గురువారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, అలాగే రూ.10 వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఆరునెలలు కావస్తున్నా అమలు చేయడంలేదన్నారు. ఆరు మాసాలు కావస్తున్నా జీతాలు కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న వలంటీర్లు ప్రభుత్వ పథకాలన్నింటినీ ప్రతి పేదవారికి చేరే విషయంలో ముందుండి పనిచేశామని వారు పేర్కొన్నారు. తక్షణం తమను విధుల్లోకి తీసుకొని, రూ.10 వేల గౌరవ వేతనాన్ని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు సాయి కృష్ణ, అజయ్, శ్రీకాంత్, కమల్ బాషా, సుబ్రమణ్యం రెడ్డి, సుధీర్ కుమార్, మహిళా వలంటీర్లు సుబ్బలక్షుమ్మ, మాణిక్యమ్మ, పావనీ, స్వప్న, రేవతి, జ్యోతి, అమ్ములు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను మరచిన ముఖ్యమంత్రి

వీరబల్లి : ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీలు, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వలంటీర్లకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మరిచారని, ఇచ్చి వాగ్దానాల ప్రకారం వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని మండలంలోని వలంటీర్లు కోరారు. రాష్ట్ర అసోసియేషన్ ఏఐవైఎఫ్ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వలంటీర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వలంటీర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు వలంటీర్ వ్యవస్థను కొనసాగించడమే కాక వారికి జీతం పెంచుతానంటూ వాగ్దానం చేసి ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయడం మరిచారన్నారు. వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యానర్ ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లారు. తదుపరి సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ కాకి వరప్రసాద్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.


నందలూరులో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 36 జీఓను ఇంజనీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలనే డిమాండ్‌తో ధర్నా కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల లోని నీటి సరఫరా విభాగంలో గత 7 ఏళ్లుగా పనిచేస్తున్న ఫిట్టర్, ఎలక్ట్రిషియన్‌లకు వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం కింద రూ. 26వేలు ఇవ్వాలన్నారు. అలానే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, శంకరయ్య, కోశాధికారి రాంబాబు, కార్మికులు దేవ, మల్లికార్జున, ఖాదర్‌వలీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి గ్రామకంఠం స్థలం కేటాయించాలి


డీటీ శ్రీనివాసులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మారమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న గ్రామకంఠంలోని 8 సెంట్లు స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని ఆలయ కమిటీ వారు రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులకు విన్నవించారు. గురువారం నాగిరెడ్డిపల్లి మూడవ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. అలాగే మూసివేసిన ఆల్విన్ కర్మాగారంలో ఏదోఒక పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని, ప్రస్తుత యజమాని అందుకు అంగీకరించకపోతే ఆ భూమిని ఇచ్చిన రైతులకే భూములు అందజేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముజీబ్ బాష, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, బిజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య, నీటి సంఘం అధ్యక్షులు ఉమామహేశ్వర్, ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ అమీర్, జుల్ఫీకర్, స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్ రాజ్, టిడిపి నాయకులు మౌల, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపస్ క్యాలెండర్ ఆవిష్కరణ


లక్కిరెడ్డిపల్లి: ఉపాధ్యాయులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ చక్రేనాయక్

లక్కిరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం లక్కిరెడ్డిపల్లి మండల శాఖ క్యాలెండర్‌ను స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మండల విద్యాశాఖ అధికారి ఎం.చక్రేనాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, వేణుమాదవరాజు, జిల్లా కార్యదర్శి బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు నాగులయ్య, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ కె.వెంకటేశ్వర్లు, సాయి చరణ్ యాదవ్, మల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ద్వార అత్యుత్తమ సేవలు

నందలూరు : అత్యుత్తమ సేవలు ద్వారా ఉపాధ్యాయుల అభిమానాన్ని పొందిన సంఘంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఉందని జెడ్పీహెచ్ఎస్ పాటూరు ప్రధానోపాధ్యాయులు మాధవీలత పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్‌లను గురువారం ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ మండలశాఖ అధ్యక్షులు షఫీవుల్లా, శివశంకర్ రెడ్డి, శారద, పవన్ కుమార్, సుస్మిత, లక్ష్మీకాంతమ్మ, శైలజ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ


రామాపురం: చంద్రావతమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గడికోట

రామాపురం : మండలంలోని చిట్లూరు గ్రామంలో పలువురిని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. చిట్లూరు గ్రామంలోని చెనికాయలవాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి తల్లి చంద్రావతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెను శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. అలానే మజ్జిగవాండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈశ్వర్‌రెడ్డి పెరాలిసిస్‌కు గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. బాధితుడిని శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామం, ఈడిగపల్లికి చెందిన వెస్టన్ యూనియన్ శాఖ యజమాని చంద్రశేఖర్ తండ్రి శంకరయ్య బుధవారం మృతి చెందారు. వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డిలు పరామర్శించారు. ఆయన మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ రెడ్డయ్య, నరసింహారెడ్డి, జనార్దన్ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మినారాయణ, శంకర్ నాయుడు, సభాపతి నాయుడు, ఓబులేసు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోండి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

రామాపురం : మండల పరిధిలోని గోపగుడిపల్లె గ్రామ పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని లక్కిరెడ్డిపల్లె డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎమ్.జయరాణి పేర్కొన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రబీ, మినుము, వేరుశనగ పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో భాగంగా రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, రైతులు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పెనగలూరు చెరువును సర్వే చేయండి

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు దగ్గర ఉన్న చెరువును సర్వే చేయాలని నీటి సంఘం అధ్యక్షుడు అభినేని రామసుబ్బానాయుడు గ్రామ సభలో గురువారం అర్జీ ఇచ్చారు. పెనగలూరు సచివాలయంలో జరిగిన గ్రామ సభలో అర్జీ ఇచ్చి చెరువు ఎంత ఉందో హద్దులు చూపించాలని వారు కోరారు. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు 22 మంది వివిధ రకాల భూ సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ ఇంద్రాణి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్, ఆర్‌ఐ రాజశేఖర్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో వరిలో దిగుబడి


రైతులకు జాగ్రత్తలను వివరిస్తున్న అధికారులు

పెనగలూరు : వరినార్లు వేసేటప్పుడు కాలిబాటలు పెట్టుకున్నట్లైతే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారి (ఏఓ) సుబ్రమణ్యం తెలిపారు. గురువారం కొండూరు, వెలగచర్ల రైతు కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలిబాటల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. రబీలో సాగుచేసిన పంటలను ఇ-పంట ద్వార నమోదు చేసుకోవాల్సిందిగా రైతులను కోరారు. అలాగే డ్రోన్లను 80శాతం రాయితీతో రైతు గ్రూపులకు ప్రభుత్వం అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మామిడి సాగులో పూతకు ముందు, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మామిడిలో పూత, మొగ్గలు ఉత్తేజపరిచి పూత రావడానికి, ఆడపూల శాతం పెరగడానికి పొటాషియం, నైట్రేట్ ఫార్ములా 4 లేదా ఆర్కా మ్యాంగో స్పెషల్ పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీవీఏ వంశీకృష్ణ, వీహెచ్ఏ మల్లేష్ నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీ కృష్ణుడి కల్యాణం


కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్ : మండలంలోని ఆకేపాడు కమ్మపల్లెలో గురువారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పురోహితులు వేదమంత్రోచ్చరణలతో స్వామి వారి కల్యాణ క్రతువును ఘనంగా జరిపించారు. అంతకుముందు ఆలయంలో హోమం కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్మపల్లె గ్రామస్తులు ఆకేపాటికి గ్రామ పొలిమేర్ల నుంచి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా కలిసిమెలిసి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేసుకున్నప్పుడే గ్రామాల్లో శాంతికుసుమాలు విరాజిల్లుతాయన్నారు.

విద్యార్థులకు పండ్లు, కేక్‌లు పంపిణీ

పట్టణంలోని మన్నూరులో ఉన్న భవిత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పండ్లు, కేక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను బాగా చూసుకోవాలని సూచించారు. భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎంతో ఓపికగా దివ్యాంగులకు సేవలు అందిస్తుండటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథరెడ్డి, జీవీ సుబ్బరాజు, దండు గోపి, శంకర్‌శెట్టి, కల్యాణ్‌రెడ్డి, సోంబత్తిన శ్రీనివాసులు, హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి కృషి


కరపత్రాలు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి సుదీర్ఘంగా కృషి సల్పుతున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్ పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల ఆహ్వాన పత్రిక, కరపత్రాలను అయన పట్టణంలోని అలీమాబాద్ జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునాట ఒక చారిత్రక అవసరం కోసం ఆగస్టు 10, 1974న యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. విద్యారంగం వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం ద్వారా సమాజాభివృద్ధికి కృషిచేస్తూ 50 సంవత్సరాల్లో రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా అవతరించిందన్నారు. ఈనెల 5, 6, 7, 8 తేదీలలో జరిగే యూటీఎఫ్ మహోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభలలో భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం, ఉపాధ్యాయుల సంక్షేమం, రావలసిన బకాయిలు తదితర విషయాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాఫీజ్, రాజారమేష్, రెడ్డిబసవయ్యతోపాటు పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


సుండుపల్లె: అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు


లక్కిరెడ్డిపల్లె: అర్జీని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

రామాపురం : గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు చేపట్టిందని ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బండపల్లి, కుమ్మరపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవడానికి ప్రజలు రెవిన్యూ సదస్సును వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామ ప్రజలు అధికారులకు అర్జీలు అందజేశారు.

పుల్లంపేట : వత్తలూరు గ్రామ పంచాయతీలో గురువారం వత్తలూరు ఉప సర్పంచ్ ఎం.శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ అరవింద కిషోర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో 133 అర్జీలు అందాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూకు సంబంధించి 37, రేషన్ కార్డుకు సంబంధించి 25, పెన్షన్లుకు సంబంధించి 59, హౌసింగ్ 6, దేవాదాయశాఖకు సంబంధించి 2, సర్వేకు సంబంధించి 3 అర్జీలు అందాయని వారు తెలియజేశారు.

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సును మండల ప్రత్యేక నోడల్ అధికారి జయరాముడు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న మాట్లాడుతూ మండలంలో రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు ఉన్నటువంటి సమస్యలను అర్జీ మూలకంగా తెలియజేయాలన్నారు. గ్రామ సభలో 32 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకట సుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్డీఓ శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని అందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఇందులో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : రైతుల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం చిన్నఓరంపాడు పంచాయతీలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సర్వే ఆన్‌లైన్, దళిత సమస్యలపై రైతులు రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీలది కీలకపాత్ర

సిద్దవటం : విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నెలకొకసారి పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని కోర్స్ డైరెక్టర్ ఎంఈఓ విలియంరాజు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు ఓరియన్‌టేషన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి, నిధుల వినియోగం, చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి చర్చించి నిర్ణయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 అరుణ, జిల్లా రీసోర్స్‌పర్సన్ డాక్టర్ మామిడి బాబు, ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, మండల రీసోర్స్ పర్సన్‌లు ఖాదర్‌వలీ, నగేష్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి : మండలంలోని పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమం ఎంఈఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి పనితీరు వంటి కార్యక్రమాలను శిక్షణలో సభ్యులకు తెలిపినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.